
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
సోమవారం 9 డిసెంబరు 2024



5

## రైతువేదికలపై పట్టింపేది?

- విడుదల కాని నిర్వహణ ఖర్చులు
- కొరవడిన పారిశుధ్యం, పచ్చదనం
- విరిగిపోయిన తలుపులు, కిటికీలు
- మందుబాబులకు అడ్డాగా వేదికలు

8



# ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు

**తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు**

**అర్హుల ఎంపికకు ప్రత్యేక యాప్**

**ప్రజాపాలనలో 2,36,014 దరఖాస్తులు**

**నేటి నుంచి సర్వే ప్రారంభించనున్న అధికారులు**

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు ఎన్నికల హామీలను దశల వారీగా అమలు చేస్తోంది. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ సౌకర్యం కల్పించింది. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. లబ్ధిదారుల ఎంపిక కోసం సీఎం రేవంత్‌రెడ్డి 5వ తేదీన ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించిన విషయం తెలిసిందే. దీంతో పేదల్లో సొంతింటిపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముందుగా ఇంటి స్థలం ఉన్న వారికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. ఒక్కో లబ్ధిదారుడికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షలు ఇవ్వనుంది. నిర్మాణ దశలను అనుసరించి నాలుగు దఫాల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమ చేయనున్నట్లు తెలిసింది.

### తొలి విడతలో సొంత స్థలమున్న వారికి..

ప్రజాపాలనలో జిల్లా వ్యాప్తంగా 26 మండలాల్లోని 499 పంచాయతీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,36,014 దరఖాస్తులు వచ్చాయి. ఇళ్ల కేటాయింపులో సొంత స్థలమున్న వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు కానున్నాయి. సిద్దిపేట నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ఇదే జిల్లాలో ఉండడంతో 3,500 ఇళ్లు రానున్నాయి. గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, జనగామ, మానకొండూరు నియోజకవర్గం ఇతర జిల్లాలతో కలిసి ఉండటంతో జిల్లాకు వీటికి కేటాయింపు లెక్క తేలాల్సి ఉంది.

### సర్వే చేయలేమంటున్న కార్యదర్శులు

నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం కానున్నది. అయితే, పంచాయతీ కార్యదర్శులు తాము పనిభారంతో కొట్టుమిట్టాడుతున్నామని, సర్వే చేయలేమని ఎంపీడీవోలకు వినతిపత్రాలను అందజేస్తున్నారు. ఇదే విషయంపై ఆంధ్రజ్యోతి డీపీవో దేవికిదేవిని వివరణ అడగగా.. సర్వేకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

### యాప్‌లో నమోదు ఇలా..

ప్రభుత్వం విడుదల చేసిన ఇందిరమ్మ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని సోమవారం నుంచి వివరాలు నమోదు చేయనున్నారు. దరఖాస్తుదారు పేరు, ఆధార్ నంబర్, సంవత్సర ఆదాయం, సొంత స్థలం ఉందా/లేదా.. ఇలాంటి 35 రకాల ప్రశ్నలకు సమాధానాలు యాప్‌లో ఎంట్రీ చేయాలి. దరఖాస్తుదారులకు ఫోన్ లేని పక్షంలో అధికారులకు వివరాలను తెలపాలి. యాప్‌లో ఏఐ టెక్నాలజీని ఉపయోగించి దరఖాస్తుదారు ముఖం, ఇల్లు నిర్మించే స్థలానికి భౌగోళిక అక్షాంశాలు, రేఖాంశాల వివరాలు నమోదు చేస్తారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని ఎప్పటిప్పుడు ఫొటోలు తీస్తారు. మున్సిపాలిటీలలో కమిషనర్, గ్రామపంచాయతీల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. కలెక్టర్ మనుచౌదరి సర్వేపైన కలెక్టరేట్లో సమావేశం నిర్వహించి, పకడ్బందీగా చేయాలని ఆదేశించారు.



# గంజాయ్!

## దారి తప్పుతున్న యువత.. ఈజీ మనీ కోసం వెంపర్లాట

గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన ఇద్దరు యువకులు.. వారికి 23 ఏళ్లు, కొండపాక మండలం సిరిసినగండ్లకు చెందిన మరొకరు.. అతడికి 21 ఏళ్లే.. గత నెల భద్రాచలం జిల్లా సీలేరులో 20 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తుండగా పోలీసులు వారిని నవంబరు 27న చాకచక్యంగా పట్టుకున్నారు. సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలోనూ పట్టుబడిన ఈ యువకులు బెయిల్‌పై బయటకు వచ్చారు. మళ్లీ అదే గంజాయి వ్యాపారాన్ని కొనసాగించారు. ప్రస్తుతం పోలీసులు వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని చూస్తున్నారు.

నిండా పాతికేళ్లు కూడా లేని ఈ యువకులు చెడు వ్యసనాలకు బానిసై ఈజీ మనీ కోసం గంజాయిని వ్యాపారంగా చేసుకున్నారు. ఎంజాయ్ కోసం యువత దారి తప్పుతున్నది. డబ్బు కోసం కొంతమంది రవాణా చేయడం, విక్రయించడం చేస్తే.. మరికొంత మంది మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను ఛిద్రం చేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నది.



**మత్తు పదార్థాలకు బానిసై.. గంజాయి వ్యాపారంలోకి**

**గంజాయి రవాణాలోనూ యువకులు**

**పట్టుబడుతున్న వారంతా 30 ఏళ్లలోపు వారే**

**బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్‌తోనూ జీవితాలు ఆగం**

గజ్వేల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లల భవిష్యత్తు కోసం పనిచేస్తుంటే కొంతమంది యువకులు మాత్రం చెడు మార్గం వైపు పయనిస్తూ తీరని శోకాన్ని మిగులుస్తున్నారు. కొందరు గంజాయి, డ్రగ్స్ అంటూ మత్తు పదార్థాలకు అలవాటు పడి అనారోగ్యం పాలవుతుంటే.. మరికొందరు అత్యాశతో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో, ఇతర అక్రమ పనుల్లో చేరి జీవితాలను పాడు చేసుకుంటున్నారు. ఇంకొందరు అప్పులు చేసి బెట్టింగ్‌లు, గేమ్‌లను ఆడుతూ డబ్బు పోగొట్టుకుంటున్నారు.

### గ్రామాల్లోకి పాకిన మత్తు

ఇటీవల కాలంలో ఎక్కువ శాతం యువతే పెడ ధోరణి వైపు మళ్లుతున్నది. ఎక్కడ చూసినా యువత మత్తుతో చిత్తు అవుతున్నది. గతంలో కేవలం పట్టణాలకే పరిమితమైన ఈ సంస్కృతి ప్రస్తుతం గ్రామాలకు పాకింది. గంజాయి, డ్రగ్స్, కొకైన్ లాంటి మత్తు పదార్థాలకు పలువురు యువకులు బానిసలుగా మారుతున్నారు. పదో తరగతి నుంచే మొదలు పెట్టి, గంజాయికి అలవాటు పడి జీవితాలను పాడు చేసుకుంటున్నారు. చదువు, ఉద్యోగం, వ్యాపారం వైపు దృష్టి సారించకుండా మత్తులో తేలుతూ జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. చిన్నతనంలోనే అనేక అనారోగ్యాలకు గురవుతూ అటు కుటుంబాలను, ఇటు వ్యక్తిగత జీవితాన్ని ఛిద్రం చేసుకుంటున్నారు.

### గంజాయి వ్యాపారం చేస్తూ

ఇటీవల కాలంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల తరలింపులో యువత కీలక పాత్ర పోషించి పట్టుబడిన ఘటనలు ఉన్నాయి. పలువురు యువకులు ఈజీ మనీకి కోసం అలవాటు పడి గంజాయి వ్యాపారం వైపు మళ్లుతున్నారు. గంజాయి వ్యాపారం చేస్తూ, పట్టుబడి జైలుకు వెళ్లి.. తిరిగి బయటకు వచ్చి మరల అదే వ్యాపారాన్ని చేస్తున్నారు. ఇదంతా 30 ఏళ్లలోపు యువత చేస్తుంటే తల్లిదండ్రులు వారికి చెప్పలేక... దారిలో పెట్టలేక, ఎటు తేల్చుకోలేక మధనపడుతున్నారు. గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్‌కు చెందిన నలుగురు యువకులు నవంబరు 12న పట్టణ శివారులో ఎండు గంజాయి

మిగతా 8వ పేజీలో

### ఆదిత్య హృదయం

# పారాయణం

వర్గల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆదివారం ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఆదిత్య హృదయం పారాయణం చేశారు. భక్తులతో కుంకుమార్చనలు నిర్వహించారు. రాష్ట్రం దేశానికి తలమానికంగా నిలిచేవిధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.




నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆదిత్య హృదయ పారాయణం నిర్వహిస్తున్న వేద పండితులు

# బ్రహ్మోత్సవాలపై సమీక్ష ఏదీ?

- ఇరవై రోజుల్లో కొమురవెల్లిలో మల్లన్న కల్యాణం
- అసంపూర్తిగానే అభివృద్ధి పనులు
- ఆలయంలో అస్తవ్యస్త పరిస్థితులు

చేర్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆవాలయంలో డిసెంబరు 29వ తేదీన జరగనున్న స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా మార్గశిర మాసం చివరి ఆదివారంతో ఉత్సవాలు ప్రారంభమై ఫాల్గుణ మాసం చివరి ఆదివారంతో ముగుస్తాయి. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా సుదీర్ఘంగా మూడు నెలల పాటు జాతర జరుగుతుంది. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రపదేశ్, ఒరిస్సా, చత్తీస్‌గడ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, వసతుల కల్పన పట్ల ఏటా కల్యాణానికి కొద్దిరోజుల ముందు జిల్లా యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిపి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించడం పరిపాటి. ఇంకా ఇరవై రోజులే ఉన్నా సమీక్షా సమావేశం నిర్వహణకు దేవాదాయశాఖతో పాటు జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

### ఏటా తప్పని సమస్యలు

సమీక్షా సమావేశం నిర్వహించినప్పటికీ ఏటా పలు సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. కొంత మేరనైనా మెరుగుపరిచేందుకు సమావేశం దోహదపడనున్నప్పటికీ ప్రతీసారి మొక్కుబడిగా చేపడుతుండటంతో తిప్పలు తప్పడం లేదు. అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ ఏళ్ల తరబడిగా నత్తనడకనసాగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ఈవో ఉన్నప్పటికీ హైదరాబాద్ దేవాదాయశాఖ అధికారిగా వ్యవహరిస్తుండటంతో వారంలో రెండురోజులు మాత్రమే స్థానికంగా అందుబాటులో ఉంటున్నారు. దీంతో పర్యవేక్షణ కరువై సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో పాలన గాడితప్పింది. గతంలో జిల్లా



మంత్రి, ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ ఆలయాధికారులతో పాటు జిల్లా యంత్రాగాన్ని అప్రమత్తం చేసేవారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం నెలకొన్న రాజకీయ పరిణామాలతో స్తబ్ధత నెలకొన్నప్పటికీ జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దృష్టి సారించి కాస్త చక్కబెడుతున్నారు.

### ఈసారి జాతరకైనా..

గతేడాది మంత్రి కొండా సురేఖ మొక్కుతీర్చుకోలేదన్న కారణంగా ఆలయానికి బదులుగా నాగుల బండలోని టూరిజం గెస్ట్‌హౌజ్‌లో సమీక్షా సమావేశం నిర్వహించడం వివాదాస్పదమైంది. కానీ సమావేశంలో మంత్రి సురేఖ ఆదేశాలను అధికార యంత్రాంగం ఏమాత్రం అమలు జరపకపోవడంతో భక్తులకు తిప్పలు తప్పలేదు. గతేడాది అప్పుడే ప్రభుత్వం ఏర్పడటంతో లోటుపాట్లు నెలకొన్నప్పటికీ ఆలయాభివృద్ధిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఏడాది కావస్తున్న నేపథ్యంలో ఈసారి జాతరకైనా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

## అల్పపీడనం ఎఫెక్ట్..

# మెదక్‌లో భారీ వర్షం

మెదక్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మెదక్ జిల్లావ్యాప్తంగా పలు చోట్ల మోస్తారు వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండగా సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. పట్టణంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిశాయి. వర్షంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడన ప్రభావంతో రానున్న రెండుమూడు రోజులు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.



చిన్నశంకరంపేటలో కురుస్తున్న వర్షం

# ఎడ్యుకేషన్ హబ్‌గా అందోలు

- టూరిజం స్పాట్‌గా సింగూరు ప్రాజెక్టు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట/పుల్‌కల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అందోలు నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్‌హబ్‌గా తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉన్నానని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. అందోలులోని కేజీబీవీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, సింగూరు ప్రాజెక్టును ఆదివారం ఆయన సందర్శించారు. గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కిచెన్‌షెడ్లను తనిఖీ చేసి విద్యార్థినులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు సుల్తాన్‌పూర్‌లో జేఎన్టీయూ, జోగిపేటలో మూడు పాలిటెక్నిక్ కళాశాలలు, మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయించానని గుర్తుచేశారు. ఈసారి వైద్యశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నెలలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయించానని పేర్కొన్నారు. గురుకుల విద్యార్థులకు అందజేసే భోజనం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. భోజనంలో తేడా జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### సింగూరులో మరింత అభివృద్ధి

సింగూరు ప్రాజెక్టును టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. మునిపల్లి మండలం రామచంద్రాపురం ద్వీపకల్పంతో పాటు ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రాంతాలను పరిశీలించామని పేర్కొన్నారు. పర్యాటకం అభివృద్ధి చెందితే స్థానికులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అనంతరం ప్రాజెక్టుకు దిగువన చేప వంటకాలను విక్రయిస్తున్న వారిని పలకరించారు. ప్రాజెక్టు వద్ద ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ముద్దాయిపేట జంక్షన్ వద్ద గురుకుల పాఠశాలను పరిశీలించారు.సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



సింగూరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి దామోదర్

## బడి బయట పిల్లలెందరు?

- విద్యాశాఖ ఆధ్వర్యంలో ఓఎస్‌సీ సర్వే
- 12 నుంచి జనవరి 11 వరకు
- 6-14, 15-19 ఏళ్ల పిల్లలను వేర్వేరుగా గుర్తింపు
- సమ్మెలో ఉద్యోగులు.. సర్వేపై ప్రభావం

7



## చెడు వ్యసనాల నుంచి పిల్లలను కాపాడుకోవాలి

- ఆర్థిక, అహంకారాలతోనే మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి
- సాహిత్యంలో తెలంగాణ ఒక మెట్టు ఎక్కువే
- ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు

7

## ఉంటే ఉండండి.. పోతేపోండి

- కొల్లూరు డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సమస్యలు తిష్ట
- విద్యుత్ లేక నీళ్ల సరఫరా బంద్
- మౌలిక వసతుల కల్పనకు రూ.6,500 వసూలు
- 15 వరకు ఇళ్లలో చేరేందుకు ప్రభుత్వం డెడ్‌లైన్

6



## మెట్రో రైలును సంగారెడ్డి వరకు వేయాలి




సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెట్రో రైలును సంగారెడ్డి వరకు వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. మహాసభలను పురస్కరించుకుని సంగారెడ్డిలో సీపీఎం నాయకులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి నుంచి హైదరాబాద్‌కు వివిధ పనుల నిమిత్తం వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రతిరోజూ వెళ్తుంటారని, వారిని దృష్టిలో పెట్టుకుని మెట్రో రైలును సంగారెడ్డి వరకు పొడిగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి అన్నివిధాలుగా విస్తరిస్తున్నా ఐటీ హబ్ లేక వెనుకపడిపోయిందన్నారు. సంగారెడ్డి అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు జనవరి 25 రెంయి 28వ తేదీవరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. మహాసభలకు పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని జయరాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణ, అశోక్, భూషణం, విఠల్, ప్రసన్న, యాదగిరి, ప్రభాకర్, మహేష్, దత్తు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# ఉంటే ఉండండి.. పోతేపోండి

**కొల్లూరు డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సమస్యలు తిష్ఠ**

- విద్యుత్ లేక నీళ్ల సరఫరా బంద్
- మౌలిక వసతుల కల్పనకు రూ.6,500 వసూలు
- ఇవ్వని వారిపై దౌర్జన్యం
- ఈనెల 15 వరకు ఇళ్లలో చేరేందుకు ప్రభుత్వం డెడ్‌లైన్
- సమస్యలు తెలుసుకుని వెనుకడుగు వేస్తున్న లబ్ధిదారులు



కొల్లూరులోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు, లబ్ధిదారుల సమావేశంలో మరమ్మతులు చేయమని తేల్చిచెబుతున్న హెచ్ఎండీఏ అధికారులు(ఫైల్)

రామచంద్రాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలోని కొల్లూరులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. కనీస వసతులకు నోచుకోక నివాసముంటూ ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. 9 అంతస్తులు కలిగిన బ్లాకులకు విద్యుత్ సరఫరా, తాగునీరు లలేకుండా ఎలా బతుకుతామని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. 'ఉంటే ఉండండి.. లేకపోతే వెళ్లిపోండి.. మీ సమస్యలు తీర్చం. మీరే సొంతంగా చేసుకోండని తేల్చి చెప్పడంతో లబ్ధిదారులు ఖంగుతిన్నారు. ఈ ఘటన గతవారం చోటు చేసుకున్నది. కొల్లూరులోని కొల్లూరు-2లో 15,660 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. ఇటీవల లబ్ధిదారులు ఒక్కొక్కరు ఇళ్లను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇక్కడి 4వ బ్లాకులోని కేబుల్ ట్రంచ్ కాలిపోవడంతో కొన్నిరోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. మేం చేయమని తేల్చిచెప్పారు. అలాగే పారిశుధ్య పనులు కూడా తమతో కుదరదని పేర్కొన్నారు.

### సొంతంగా నిర్వహించేందుకు ముందుకు..

సొంత నిధులతో పనులు నిర్వహించేందుకు కొంత మంది లబ్ధిదారులు ముందుకొచ్చారు. బ్లాక్‌ను శుభ్రం చేసేందుకు ఒక్కో కుటుంబం రూ.2,500 వేలు ఇవ్వాలన్నారు. మొత్తం బ్లాకులో 108 ఇళ్లు ఉన్నాయి. సగం మంది మాత్రమే ఇళ్లలోకి చేరారు. విద్యుత్ మరమ్మతుల కోసం ఇంటికి రూ.4వేలు ఇవ్వాలని సూచించారు. ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించడంతో డబ్బులు కట్టకపోతే పాస్‌పుస్తకం రద్దు చేయిస్తామంటూ బెదిరించారు. దీంతో ఆగ్రహానికి గురైన సదరు మహిళ ఏం చేస్తారో చేసుకోండి తిరగబడింది. డబుల్ బెడ్‌రూం ఇళ్లలోని సమస్యలు లబ్ధిదారుల మధ్య గొడవలు సృష్టిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

### తాగునీటిలో చెత్తాచెదారం..

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సరఫరా అయ్యే తాగునీటిలో చెత్తాచెదారం కలిసి రావడంతో లబ్ధిదారులు తాగేందుకు నిరాకరిస్తున్నారు. చేసేదేం లేక సుమారు రెండు కిలోమీటర్లు నడిచివెళ్లి క్యాన్లలో తాగునీటిని తీసుకొచ్చి పై అంతస్తు వరకు మోసుకెళ్తూ నరకం చూస్తున్నారు.

### డిసెంబరు 15లోగా ఇళ్లల్లో చేరాల్సిందే

సమస్యలు ఒకెత్తైతే డిసెంబరు ఈనెల 15లోగా ఇళ్లల్లో చేరాలని ఇప్పటికే హెచ్ఎండీఏ పేర్కొంది. ఇంకా ఇళ్లు స్వాధీనం చేసుకోని లబ్ధిదారులు విద్యుత్, తాగునీరు లేకపోతే అక్కడ ఎలా ఉంటామని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొల్లూరులోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలోని సమస్యలు పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## విద్యాబోధనతో పాటు సమాజాన్ని చదవాలి

- ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఖేడ్‌లో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు విద్యాబోధన చేయడంతో పాటు సమాజాన్ని సైతం చదువుకుంటూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో టీఎస్‌యూటీఎఫ్ 6వ జిల్లా మహాసభలను మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కే.నాగేశ్వర్‌రావుతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాని పేర్కొన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడం గురించి కూడా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కే.నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పుస్తక పఠనానికి దూరం కాకుండా ప్రతి నిత్యం, నిత్య విద్యార్థులుగా అధ్యయనం చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధితో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను తమ సంఘం ఆహ్వానిస్తుందన్నారు. పాఠశాలల పర్యవేక్షక అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందువల్ల డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతీ ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జ్ఞాన మంజరి, జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్, సువర్ణ, కోశాధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శులు అమరేశ్వరి, శామయ్య, సాయితేజ, ఏశప్ప, క్రిష్ణమూర్తి, నరేష్‌స్వామి, జగన్‌మోహన్, నర్సయ్య, సంయోద్దీన్, అనురాధ, ముకుంద్, క్రిష్ణంరాజుతో పాటు ఖేడ్ డివిజన్ పరిధిలోని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## 3 కిలోల ఎండు గంజాయి పట్టివేత



నిందితులను చూపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కంగ్టి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుట్టుచప్పుడు కాకుండా ఎండు గంజాయిని తరలిస్తున్న ఇరువురిని పట్టుకుని, వారి నుంచి మూడుకిలోల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకుని, బైక్ సీజ్‌చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నమ్మదిగిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం కంగ్టి-దెగుల్‌వాడి మార్గమధ్యలో వాహనాలు తనిఖీ చేస్తుండగా (ఏపీ 29 ఏవీ 3850) నెంబరు గల బైక్‌పై కర్ణాటకలోని నాగన్‌పల్లికి చెందిన అరుణ్, మారెప్పలు ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. దీంతో మూడుకిలోల గంజాయితో పాటు బైక్‌ను, రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీఐ వీణారెడ్డి, ఎస్ఐ యాదయ్య, సిబ్బంది విఠల్, అనిల్‌కుమార్, సతీష్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

## 11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.49,190 నగదు, రూ.12 లక్షల విలువైన క్యాసినో కాయిన్స్, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రసన్నకుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్‌రెడ్డి

కొల్చారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం సాయంత్రం కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి శివారులోని ఏడుపాయలకు వెళ్లేదారిలో ఓ రెస్ట్ రూమ్‌లో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్ఐ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి దాడిచేసి 11 మందిని పట్టుకున్నారు. వీరి నుంచి రూ.49,190 నగదు, రూ.12 లక్షల విలువైన క్యాసినో కాయిన్స్, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే రెస్ట్‌హోమ్ యజమాని సాయగౌడ్, జూదం నిర్వాహకులు వెంకటోరెడ్డి, సంతోష్‌సింగ్ పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామన్నారు. పవిత్రమైన ఏడుపాయలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ఏడుపాయలకు వచ్చే భక్తులు కాటేజ్‌లలో, రెస్ట్ హోమ్‌లలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

## నిర్లక్ష్యం ఖరీదు.. నిండు ప్రాణం

- గొర్రెల కాపర్లపైకి దూసుకెళ్లిన కారు
- అక్కడికక్కడే ఓ యువకుడి మృతి

జోగిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు నిర్లక్ష్యంగా కారును నడిపి గొర్రైకాపరి మృతికి కారణమయ్యాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలం కిచ్చనపల్లి శివారులో జరిగింది. జోగిపేట ఎస్ఐ పాండు వివరాల ప్రకారం.. రాంసాన్‌పల్లికి చెందిన వరదపాటి శ్రీకాంత్.. కిచ్చనపల్లి నుంచి కుసంగికి వెళ్లే రోడ్డులో తన కారును నిర్లక్ష్యంగా నడుపుతూ గొర్రైలకాపరి పైకి ఎక్కించాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన గొర్రైలకాపరి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

## దొడ్డు రకానికీ బోనస్ ఇవ్వాల్సిందే

- రైతు సంఘం నాయకులు

అల్లాదుర్గం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యానికి బోనస్‌గా రూ.500లు అందిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు రకం వరి ధాన్యానికి కూడా అందించాలని రైతు సంఘం మండలాధ్యక్షుడు బగిలి రమేష్, ప్రధాన కార్యదర్శి భేతయ్య, ఉపాధ్యక్షుడు వలీపాషా, వట్‌పల్లి ఏఎంసీ మాజీ డైరెక్టర్ సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు ద్వారా ఎకరానికి రూ.5 వేలు అందిస్తుండగా.. ఎన్నికల ముందు కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే రూ.7,500 వేలు అందిస్తామని, ధాన్యం క్వింటాల్‌కు రూ.500ల బోనస్ ఇస్తామని ప్రకటించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అవేమీ అమలుచేయకుండా రైతులను మోసం చేశారన్నారు. రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో మంజూరు కాలేదని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నక్క భేతయ్య, కంతి వాసీం, కుర్మ శంకరయ్య, మంగలి నారాయణ, కళాయి వెంకటేశం, నీళ్ల విఠల్ పాల్గొన్నారు.

## జీవో 317ను సవరించి ఉపాధ్యాయులను ఆదుకోవాలి

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య

చిన్నశంకరంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవో 317 సవరిస్తూ స్థానికత ఆధారంగా డీఎస్సీని ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో రాష్ట్ర 78వ కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ ర్యాంకు ప్రకారం.. విడతలవారీగా ఉపాధ్యాయులను జిల్లాలవారీగా నియమించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని కోరారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి ప్రత్యేక నిధులను మంజూరు చేయాలన్నారు. అలాగే పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వైద్యుల సలహాలతో టీబీ నియంత్రించొచ్చు

- వైద్యాధికారి సాయిసింధు

చిన్నశంకరంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైద్యుల సలహాతో టీబీని నియంత్రించొచ్చని మండల వైద్యాధికారి సాయిసింధు అన్నారు. ఆదివారం చిన్న శంకరంపేట మండలంలోని గవ్వలపల్లి పల్లె దవాఖానాలో టీబీపై వ్యాధిగ్రస్తులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి సోకినట్లయితే వైద్యుల సూచనలు పాటించి, మాత్రలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

## 'కుక్కల దాడులను అరికట్టాలి'

నారాయణఖేడ్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ ప్రాంతంలో జరుగుతున్న కుక్కల దాడులను అధికార యంత్రం అరికట్టాలని ఖేడ్ మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, కురుమ సంఘం ఖేడ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మల్గొండలు డిమాండ్ చేశారు. ఆదివారం ఖేడ్ మండలం ర్యాకల్, లింగాపూర్ గ్రామాలకు చెందిన కుక్కల దాడుల్లో గాయపడి ఖేడ్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న పలువురు బాధితులను వారు పరామర్శించి మాట్లాడారు. అనేక గ్రామాల్లో వీధి కుక్కలు చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కుక్కల దాడులను అరికట్టాలన్నారు.

## రామచంద్రాపురంలో భారీ చోరీ

- 46 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదు అపహరణ



చిందరవందరంగా పడి ఉన్న వస్త్రాలు

రామచంద్రాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. డీఐ శ్రీకర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్‌కాలనీలో నివాసం ఉంటున్న రామకృష్ణరావు కానిస్టేబుల్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. శనివారం రాత్రి భోజనం చేసి కుటుంబసభ్యులు నిద్రించారు. ఆదివారం ఉదయం నిద్ర లేచేసరికి మెయిన్‌డోర్ పక్కన కిటికీ పగలగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. ఆందోళన చెందిన కుటుంబీకులు పక్కగదిలోకి వెళ్లి చూస్తే వస్త్రాలు చిందర వందరగా పడిఉన్నాయి. చీరలో చుట్టి భద్రపర్చిన బాక్స్ కనపడలేదు. ఆ బాక్స్‌లో ఉన్న 46 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలు, రూ. 20 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ శ్రీకర్‌బాబు తెలిపారు.

# బడి బయట పిల్లలెందరు?

- విద్యాశాఖ ఆధ్వర్యంలో 'ఓఎస్‌సీ' సర్వే
- 12 నుంచి జనవరి 11 వరకు
- 6-14, 15-19 ఏళ్ల పిల్లలను వేర్వేరుగా గుర్తింపు
- బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే లక్ష్యం
- సమ్మెలో ఉద్యోగులు.. సర్వేపై ప్రభావం



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : చదువుకునే వయసులో ఆర్థిక స్థోమత, కుటుంబ పరిస్థితుల కారణంగా పలువురు పిల్లలు బడికి వెళ్లడం లేదు. కొందరు ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంటే, ఇంకొందరు కుల వృత్తిలో కొనసాగుతున్నారు. మరికొందరు కార్ఖానా, హోటళ్లు, బేకరీలు తదితర పని ప్రదేశాల్లో బాల కార్మికులుగా మారి విద్యకు దూరమవుతున్నారు. ఫలితంగా ఉన్నత విద్యన భ్యసించాలన్న వారి ఆశయం నెరవేరడం లేదు. దీంతో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే విధంగా బడి బయటి పిల్లల గుర్తింపు పేరిట ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్(ఓఎ‌స్‌సీ)సర్వేను చేపట్టాలని నిర్ణయించింది.

### 12 నుంచి మొదలు..

బడీడు పిల్లల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా పాఠశాలలకు రాని బడీడు పిల్లలను తేల్చేందుకు విద్యాశాఖ చర్యలకు ఉపక్రమించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలబాలికల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ చాలామంది చిన్నారులు బడికి దూరంగానే ఉంటున్నారు. ఎన్ని సర్వేలు చేసినా.. పిల్లలు చదువుకోవాలని అధికారులు పదేపదే చెబుతున్నా, బాల్యం మాత్రం బడిబయటే మగ్గుతున్నది. కొందరు బడికి వచ్చి మధ్యలో ఆగిపోయిన వారు ఉంటున్నారు. వారందరినీ బడిలో చేర్పించేందుకు విద్యాశాఖ ఈ నెల 12 నుంచి జనవరి 11 వరకు సర్వే చేయాలని ఆదేశించింది. యేటా విద్యాశాఖ రెండు సార్లు సర్వే నిర్వహిస్తున్నది.

### 6-14, 15-19 ఏళ్ల పిల్లల గుర్తింపు

సర్వే ద్వారా 6-14 ఏళ్లలోపు బడీడు పిల్లలను, అదే విధంగా కళాశాల స్థాయిలో 15-19 ఏళ్ల పిల్లలను వేర్వేరుగా గుర్తించి జాబితా రూపొందించనున్నారు. విద్యార్థి సామర్థ్యం, వయసు ప్రకారం వీరి అర్హత ఆసక్తిని బట్టి తగిన తరగతిలో చేర్పించటం, దూర విద్యలో ప్రవేశాలు కల్పించేలా అధికారులు కృషి చేయనున్నారు. విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్ష కింద పని చేసే సీఆర్పీలు క్షేత్ర స్థాయిలో వెళ్లి సర్వే చేయనున్నారు. ఉన్నత చదువుల ఎందుకు నిలిపేశారనే అంశాలు, పరిస్థితులపై ఆరా తీసి సమాచారాన్ని నమోదు చేస్తారు. జనవరి 11 వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటికి తిరుగుతూ సర్వే పూర్తి చేయాలని సీఆర్పీలు, ఐఈఆర్పీ, డీఎల్ఎంటీలను విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఆవాస ప్రాంతాలు, గృహాలు, పనిప్రదేశాలను సందర్శించి ఆరా తీసి వివరాలు సంబంధిత ప్రొఫార్మాలో నమోదు చేయాల్సి ఉంటుంది. తదనంతరం జాతీయ స్థాయిలో రూపొందించిన ప్రబంధ్ పోర్టల్‌లో బడి బయటి పిల్లల వివరాలు అప్‌లోడ్ చేస్తారు. వారు వచ్చే విద్యా సంవత్సరం నుంచి బడికి వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఆసక్తి ఉన్న వారిని వృత్తి విద్యాకోర్సుల్లో చేర్పించనున్నారు. ఉన్నత విద్య ఫలాలు అందించి జీవితంలో స్థిరపడేలా చేయూతనివ్వనున్నారు. సర్వేను విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తారు.

### సర్వేపై నిరవధిక సమ్మె ప్రభావం

ఓ వైపు విద్యాశాఖ బడి బయటి పిల్లలను గుర్తించే సర్వే చేయాలని ఆదేశించగా, మరో వైపు సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు రెండు రోజుల నుంచి నిరవధిక సమ్మెలో ఉన్నారు. ప్రధానంగా సర్వే చేయాల్సిన సీఆర్పీలు, ఐఈఆర్పీ తదితర ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు. ఈ సారి తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె చేస్తామని సంఘం నాయకులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ సర్వేపై ఉద్యోగుల సమ్మె ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

### ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

ఈ నెల 12 నుంచి ఓఎస్‌సీ సర్వే చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమాచారం చేరవేశాం. ఉద్యోగులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. కానీ జిల్లాలో బడి బయటి పిల్లల గుర్తింపును మాత్రం ఉన్న సీఆర్పీలు క్షేత్ర స్థాయిలో వెళ్లి సర్వే చేయాల్సి ఉంటుంది.

- ఎస్.వెంకటేశ్వర్లు, డీఈవో, సంగారెడ్డి జిల్లా

న్యూస్ బాక్స్

## గ్రామీణ క్రీడలు ఎంతో అవసరం

● జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా అధికారి నాగరాజు

చేగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి గ్రామీణ క్రీడలు ఎంతో అవసరమని మెదక్ జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు అన్నారు. చేగుంట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సీఎం కప్ క్రీడలను మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తుందన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. క్రీడలతో విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు నవీన్, జూనియర్ అసిస్టెంట్ విజయ్, ఈవో నరేష్, పీఈటీలు శారద, మంజులత, శంకర్ చారి పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

నర్సాపూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం సేకరిస్తున్న వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని పెద్దమ్మకాలనీలో కొందరు ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ వ్యాన్‌లో తరలించడానికి సిద్ధమవుతున్నారు. దీన్ని గమనించిన కొందరు స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆర్ఐ ఫిరోజ్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని వ్యాన్‌లో తనిఖీలు చేయగా పీడీఎస్ బియ్యం కనిపించాయి. దీంతో ఆ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు. ఆ వ్యాన్‌లో సుమారు పదిక్వింటాళ్ల బియ్యం ఉన్నాయని, పూర్తి స్థాయి విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

న్యూస్ బాక్స్

## జాతీయస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి



రామ్‌చరణ్

కోహెడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జూడో పోటీలకు మండలంలోని నాగసముద్రాల మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు భరత్ తెలిపారు. కోహెడ మండలం గుండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మేడవేణి రామ్‌చరణ్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతున్నాడు. వరంగల్ జిల్లా పోచమ్మ మైదాన్‌లోని కెమిస్ట్రీ భవన్‌లో ఈ నెల 3 నుంచి 5 వరకు జరిగిన ఎస్జీఎఫ్ తెలంగాణ అండర్ 19 చాంపియన్‌షిప్‌లో రామ్‌చరణ్ పాల్గొని బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు సిద్దిపేట జిల్లా ఎస్జీఎఫ్ అండర్ 19 కార్యదర్శి సమ్మయ్య తెలిపారు. డిసెంబరు 11 నుంచి 17 వరకు పంజాబ్ రాష్ట్రంలోని లుధియానాలో జరిగే అండర్ 19 జూడో పోటీలలో 90 వెయిట్ కేటగిరిలో తెలంగాణ రాష్ట్రం నుంచి రామ్‌చరణ్ పాల్గొంటున్నారని తెలిపారు. రామ్‌చరణ్ జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు మైనార్టీ గురుకుల విద్యార్థి




చందును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విమలారెడ్డి

దుబ్బాక, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి అండర్ 19 వాలీబాల్ పోటీలకు దుబ్బాక మైనార్టీ గురుకుల విద్యార్థి చందు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విమలారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెలలో గజ్వేల్ గర్ల్స్ హబ్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 10 మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో చందు పాల్గొంటాడని తెలిపారు. ఆ విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో వార్డెన్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

# నీరాజనం ఖండకావ్యం పుస్తకం ఆవిష్కరణ



నీరాజనం ఖండకావ్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కసిరెడ్డి వెంకటరెడ్డి, పెంటారెడ్డి తదితరులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : సాహిత్య రంజని సాహితీ సాంస్కృతిక కళా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, తెలుగు పాఠ్య పుస్తక రచయిత, విశ్రాంత భాషోపాధ్యాయులు మహ్మద్ షరీఫ్ రచించిన నీరాజనం ఖండకావ్యం పుస్తకావిష్కరణ కార్యక్రమం సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఘనంగా జరిగింది. ఓయూ పూర్వ తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మద్ షరీఫ్ రచించిన సాహిత్యం సమాజానికి హితంగా ఉందని, అందరికి నీరాజనం పలికేలా ఉందని కొనియాడారు. 54 కంటికలు, 657 పద్యాలతో చక్కటి ఖండకావ్యం రచించిన షరీఫ్‌ను వెంకటరెడ్డి అభినందించారు. సమాజంలోని అన్ని వర్గాలను గుర్తిస్తూ రాయడాన్ని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో సాహిత్య రంజని అధ్యక్షుడు పల్లె పెంటారెడ్డి, సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత ఈదర సల్మోన్‌రెడ్డి, శతావధాని మలుగ అంజయ్య, డా.నలవోలు నరసింహారెడ్డి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రముఖ కవి దోరవేటి, ఎట్ల రమేశ్, సంధ్య సార విశ్వనాథం, రమేశ్, కమలేశ్, కవులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తంతో మంత్రి దామోదర్ చిత్రం



వట్‌పల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మంత్రి దామోదర్ రాజనర్సింహ వీర అభిమాని అయిన వట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఖాజా ఎన్ఎస్‌యూఐ అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దామోదర రాజనర్సింహ జన్మదినం సందర్భంగా ఖాజా తన రక్తంతో మంత్రి చిత్రపటాన్ని వేయించి సంగారెడ్డిలోని మంత్రి నివాసానికి వెళ్లి బహుకరించారు.



## 60 వేల మీటర్ల దారంతో త్రెడ్ ఆర్ట్

మునిపల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లికార్జున్‌పల్లి గ్రామానికి చెందిన దూదెకుల జహంగీర్ అనే విద్యార్థి 60 వేల మీటర్ల దారంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రం వచ్చేలా త్రెడ్ ఆర్ట్ రూపొందించాడు. రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి సహకారంతో దీన్ని తయారుచేసి మంత్రి పుట్టిన రోజు సందర్భంగా గిఫ్ట్‌గా అందజేశారు. దీంతో ఆదివారం మంత్రి తన నివాసానికి జహంగీర్‌ను పిలిపించి శభాష్ అంటూ అభినందించారు.

## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

● పేటకు చెందిన సూక్ష్మ కళాకారుడు శ్రీనివాస్ ప్రతిభ



శ్రీనివాస్‌చారిని సన్మానిస్తున్న వండర్ బుక్‌ఆఫ్ రికార్డ్స్ ఇండియా సంస్థ బాధ్యులు

పెద్దశంకరంపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేటకు చెందిన సూక్ష్మ కళాకారుడు అవుసుల శ్రీనివాస్‌చారి రూపొందించిన సూక్ష్మ కళారూపాలను పరిగణనకు తీసుకొని ఆయనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఆదివారం సంగారెడ్డిలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ నరేందర్, యువజన సంఘాల ప్రతినిధి కోణ వేణు, సమక్షంలో శ్రీనివాస్‌చారికి మెమోంటోతోపాటు ధ్రువపత్రాన్ని అందజేశారు. వండర్ బుక్‌ఆఫ్ రికార్డ్స్ ప్రెసిడెంట్ సలీం, సంస్థ బాధ్యులు మెమోంటో అందజేసినవారిలో ఉన్నారు.

# చెడు వ్యసనాల నుంచి పిల్లలను కాపాడుకోవాలి

- ఆర్థిక, అహంకారాలతోనే మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి
- సాహిత్యంలో తెలంగాణ ఒక మెట్టు ఎక్కువే
- ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ గరికపాటి నరసింహారావు



ప్రసంగిస్తున్న గరికపాటి నరసింహారావు

మెదక్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో పిల్లలు చెడు వ్యసనాల బారిన పడుతున్నారని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ గరికపాటి నరసింహారావు అన్నారు. ఆదివారం రాత్రి మెదక్ పట్టణంలోని సాయిబాలాజీ గార్డెన్‌లో ఆయన ప్రవచనం చేయగా వందలాది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాభారతం నుంచి మొదలుకొని యోగ వాశిష్టం, రామాయణం లోని సుందరా కాండ ఘట్టం, భాగవతం, తదితర క్లిష్టమైన అంశాలను సైతం చమక్కులతో వివరించారు. ప్రస్తుత సమాజంలో మనుషులు తమ వివేకాన్ని కోల్పోయి అధఃపాతాళానికి పడిపోయి భ్రష్టుపడుతున్నారన్నారు. డబ్బు డాంబికంతో మానసంబంధాలను దెబ్బతీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను చదువుల్లో వచ్చే మార్కులు విషయంలో మిగతా పిల్లలతో పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. దాంతో విద్యార్థుల మనస్సులపై వత్తిడి పెరిగిపోయి ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పదిసంవత్సరాల వయస్సు వచ్చే వరకు పిల్లలను ఒంటరిగా వదలకూడదని, అలా ఉంచితే వారికి ఆటిజం వ్యాధి వస్తోందని వైద్యులు చెబుతున్నారన్నారు. యువతరానికి దేశభక్తి, నైతిక విలువలు, సత్ప్రవర్తన వంటివి నేర్పాలని సూచించారు. సాహిత్యంలో తెలంగాణ ఒక మెట్టు ఎక్కువగానే ఉందన్నారు. తిరుపతి వెంకట కవులు ఒకప్పుడు గద్వాల్, వనపర్తి సంస్థానాలలో తమ పాండిత్యాన్ని ప్రదర్శించి పాలకులచే సన్మానాలు పొందేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వ్యాపారవేత్తలు రాగి వెంకటేశ్, మాలె ప్రసాద్, శ్రీనివాస్, జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు వేద వ్యాస్, వైద్య శ్రీనివాస్, భాష్యం మధుసూదనాచార్య, వైద్య రాజుశర్మ, రాగి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న పట్టణ ప్రజలు

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

● సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య



లైబ్రరీ సిబ్బంది, పాఠకులతో మాట్లాడుతున్న చైర్మన్ అంజయ్య

జహీరాబాద్ డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గల గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠకుల డిమాండ్‌కు అనుగుణంగా పుస్తకాలను సమకూరుస్తామన్నారు. గ్రంథాలయంలో నెలకొన్న సమస్యల గురించి పాఠకులు, లైబ్రరీ అధికారిని అడిగి తెలుసుకున్నారు.

## వట్‌పల్లికి 108 అంబులెన్స్

వట్‌పల్లి, డిసెంబరు 8. (ఆంధ్రజ్యోతి) : వట్‌పల్లి మండల ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం 108 అంబులెన్స్ వాహనాన్ని ఆదివారం మంజూరు చేసింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో ఈ అంబులెన్స్ మంజూరు చేశారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.







గుట్టపై ఏర్పాటు చేసిన వైకుంఠధామం

# దారి లేక.. దరి చేరలేక..

- నిరుపయోగంగా మాడాపూర్ వైకుంఠధామం
- ఒక్కరు నడవడమే కష్టం.. ఇక మృతదేహాన్ని మోసుకెళ్లడం ఎట్లా?
- రోడ్డు నిర్మించి వినియోగంలోకి తేవాలని వేడుకోలు

నర్సాపూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ పంచాయతీ పరిధిలో ఎంతో ఆర్భాటంగా లక్షల రూపాయలతో వైకుంఠదామాలను నిర్మించింది. అధికారులు వాటిని తూతూమంత్రంగా ఏర్పాటు చేయడంతో చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వం ప్రతి పంచాయతీలో ఖచ్చితంగా వైకుంఠదామాలు నిర్మించాలని ఆదేశాలు జారీ చేయడంతో స్థానిక అధికారులపై ఉన్నతధికారులు ఒత్తిడి చేశారు. దీంతో ఎలాగైనా వాటిని ఏర్పాటు చేయాలనే తపన తప్పా నిర్మించడానికి సరైన స్థలం, ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడుతుందన్న విసయాలపై దృష్టి పెట్టకుండా ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం మాడాపూర్ పంచాయతీ పరిధిలోని వైకుంఠధామం కూడా ఇదే కోవకు వస్తుంది. మాడాపూర్ తండాకు కిలోమీటరు దూరంలో ఎత్తైన గుట్టపై వైకుంఠధామం నిర్మించారు. అక్కడకు వెళ్లడానికి సరైన రోడ్డు కూడా లేదు. అక్కడి వరకు ఏదోలా కష్టపడి శవాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్లినా ఎత్తైన చోట నిర్మించి ఉన్న దహనవాటిక వరకు ఎత్తుకెళ్లడానికి సాధ్యం కాదు. కనీసం ఒక వ్యక్తి కూడా అక్కడి వరకు వెళ్లే పరిస్థితి లేదు. అటువంటింది శవంతో నలుగురు ఒకేసారి ఎలా వెళ్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఈ వైకుంఠధామం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరైన దారి ఏర్పాటు చేసి వైకుంఠధామాన్ని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

# రైతువేదికలపై పట్టింపేది?

- ఆరంభ శూరత్వంగా నిర్వహణ
- విరిగిపోయిన తలుపులు, కిటికీలు
- ఇబ్బందుల్లో మహిళా ఏఈవోలు

దూళిమిట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగు సంబంధిత, వివిధ రకాల సమావేశాలు నిర్వహించేందుకు గత ప్రభుత్వం రైతు వేదికలు నిర్మించింది. ప్రారంభంలో బాగానే ఉన్నా ప్రస్తుతం నిర్వహణ లేక అవి సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. మండలంలోని రైతువేదికల ఆవరణ, మరుగుదొడ్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన రైతువేదికలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయి.



బైరాన్‌పల్లి రైతువేదికలో విరిగిపోయిన తలుపులు



బైరాన్‌పల్లిలో తలుపులు లేని మరుగుదొడ్డి

### విడుదల కాని నిర్వహణ ఖర్చులు

రైతు వేదిక నిర్వహణకు నెలకు రూ.9 వేల చొప్పున విడుదల చేస్తామన్న గత ప్రభుత్వం ఒకటిరెండు నెలలు మాత్రమే విడుదల చేసింది. తర్వాత నిధుల జాడ లేకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. రైతు సమావేశాలు నిర్వహించినప్పుడు కనీసం తేనీటికి కూడా డబ్బులు లేవనీ ఏఈవోలు వాపోతున్నారు. స్టేషనరీ మొదలగు వాటికి కూడా ఏఈవోలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో పాటు నిర్మాణం నాసిరకంగా చేపట్టడంతో టైల్స్ ఊడిపోతున్నాయి. నీటి సరఫరా సంగతి ఇక చెప్పనక్కర్లేదు. భూసార పరీక్షలు చేయాల్సి ఉన్నా నిధుల లేమితో అవీ అటకెక్కాయి.

### కొరవడిన పారిశుధ్యం, పచ్చదనం

పచ్చటి వాతావరణంలో ఆహ్లాదకరంగా ఉండాల్సిన రైతు వేదికలు మొక్కల సంరక్షణ లేకపోవడంతో పచ్చదనం కరువైంది. రైతు వేదికల్లో పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో చెత్త చెదారంతో దర్శనమిస్తున్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది కొన్నిసార్లు శుభ్రం చేస్తున్నారు.

### రైతువేదికల్లోకి కోతులు

కాంట్రాక్టర్లు రైతు వేదిక ప్రధాన ద్వారాలకు, కిటికీలకు నాసిరకం డోర్లు బిగించి చేతులు దులుపుకున్నారు. దీంతో కొన్ని రోజులకే అవి విరిగిపోయాయి. మరుగుదొడ్లకు డోర్లు లేకపోవడంతో మహిళా ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు డోర్లు లేని కారణంగా కోతులు రైతువేదికల్లోకి ప్రవేశించి కలవరపాటుకు గురిచేస్తున్నాయి.

### మందుబాబులకు అడ్డాగా

రైతువేదికల డోర్లు విరిగిపోవడం, గ్రామానికి దూరంగా ఉండటంతో మందుబాబులు వాటిని అడ్డాలుగా మార్చుకుంటున్నారు. రాత్రి వేళల్లో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రతీరోజు ఉదయం రైతు వేదికల్లో ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. రైతు వేదికల్లో ఉన్న ఫర్నిచర్, ఫ్యాన్లను కూడా కొందరు అపహరించుకుపోయారు.

### తలుపులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



మా గ్రామంలోని రైతువేదికకు తలుపులు బిగించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఇవి ఉంటే రైతు వేదికలోని వస్తువులకు రక్షణ లభిస్తుంది. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేయవచ్చు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలి.

- పుప్పాల రాజు, బైరాన్‌పల్లి

## కనీస వేతన జీవోలను విడుదల చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్మికులందరికీ కనీస వేతన జీవోను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. సీఐటీయూ సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు, స్కీమ్ వర్కర్లకు జీతాలు పెంచి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంఘటిత, అ సంఘటిత రంగ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలుతోపాటుగా ప్రమాద బీమా కల్పించాలన్నిరు. 56 సంవత్సరాలు పైబడిన ప్రతీ కార్మికుడికి పెన్షన్ ఇచ్చే విధంగా ప్రభుత్వ కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య జిల్లా కోశాధికారి గొడ్డు బర్ల భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ

## బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేస్తాం

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

రాయపోల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజాగౌడ్‌తో కలిసి శనివారం మండలంలోని పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయపోల్ మండలంలో బూత్ కమిటీలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులను మోసం చేసి, ఈ రోజు విజయోత్సవ సభలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ విభాగం నాయకుడు మంకిడి స్వామి, మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి, సుకేందర్‌రెడ్డి, నామసాని స్వామి, కొండారి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విభీషన్‌రెడ్డి

## ప్రభుత్వాన్ని బద్‌నామ్ చేయడం మానుకోవాలి

- కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట టౌన్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్‌నామ్ చేయడం మానుకోవాలని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. సిద్దిపేట పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేయలేని పనులను ఏడాదిలో సీఎం రేవంత్‌రెడ్డి చేసి చూపించారని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరిస్తే విమర్శలు చేయడం తగదని, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహంపై రాద్ధాంతం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, కిషన్, బాబా, నజ్జు, ఫయాజ్, అనిల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అత్తుఇమామ్

## నిర్బంధ పాలన పోయి.. ప్రజాపాలన వచ్చింది

- జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి

హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాల నిర్బంధ పాలన పోయి ప్రజా పాలన వచ్చిందని జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిందని తెలిపారు. సంవత్సరకాలం విజయవంతంగా పాలన కొనసాగించిన కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట జేఏసీ నాయకులు ద్యాగల సారయ్య, కోహెడ కొమురయ్యప్రకాష్, ఇల్లందుల లక్ష్మణ్, వడ్డేపల్లి మల్లేశం, తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

## నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

చేర్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండల కేంద్రంతో పాటు చుంచనకోట గ్రామాల్లో ఆదివారం అనుమానాస్పద ప్రాంతాల్లో చేర్యాల ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా జాగ్రత్తంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో పాటు మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసినా చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



చేర్యాలలోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

## అయ్యప్పస్వాములకు ఘన స్వాగతం

- సిద్దిపేట నుంచి శబరిమలైకు బయలుదేరిన స్వాములు

కొండపాక, డిసెంబరు 8: శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములకు మండలంలోని దుద్దెడలో స్థానిక అయ్యప్ప స్వాములు ఆదివారం ఘన స్వాగతం పలికారు. సిద్దిపేట కోటిలింగాల సన్నిధానం నుంచి శబరిమలకు ఇరుముడితో బయలుదేరిన బీజేపీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జాలిగామ ఉపేందర్‌రావు గురుస్వామితో పాటు శబరిమలకు వెళ్తున్న మరికొంతమంది అయ్యప్ప స్వాములకు దుద్దెడలోని అయ్యప్ప మాలధారులు స్వాగతం పలికారు. కండువాలు కప్పి ఆశీర్వచనం తీసుకున్నారు. కార్యక్రమంలో గురుస్వాములు చిలుముల వెంకటేశం, కనకరాజు అయ్యప్ప స్వాములు బొజ్జ జగదీశ్వర్, పెద్దంకుల నాగరాజుగౌడ్, శీలం రాజు, గున్నాల నాగరాజుగౌడ్, పెద్దంకుల నరేందర్‌గౌడ్, వెంకట్ పాల్గొన్నారు.

### గుట్ట మల్లన్న ఆలయంలో పూజలు

హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలోని ఏనే పై ఉన్న శ్రీ గుట్ట మల్లన్న స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న స్వామి ఐదవ పట్నం వేసి ఘనంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లోని మల్లన్న స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్, తదితరులు

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల వారోత్సవం

కోహెడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఇందులో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్యాల సంపత్, వేణుగోపాల్, రాజిరెడ్డి, రాధిక పాల్గొన్నారు.




కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు చిట్యాల సంపత్

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ




చెక్కులను అందజేస్తున్న నాయకులు

రాయపోల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాజీపూర్‌కు చెందిన గడ్డం యాదగిరికి రూ. 60వేలు, రాగంకు చెందిన కె. మహిపాల్‌కు రూ. 22 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. వాటిని ఆదివారం బీజేపీ రాయపోల్ మండలం అధ్యక్షుడు రాజాగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి, జిల్లా ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు మంకిడి స్వామి, మండల కార్యదర్శి నీల స్వామి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నిధుల మంజూరుకు కృషి చేసిన ఎంపీ రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నామసాని స్వామి, మహిపాల్ ఉన్నారు.

## కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా ఉంటాం

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన పదోవార్డు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త చిక్కుడు కిరణ్‌కుమార్ కొన్నాళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడికి పార్టీ సభ్యత్వం ఉండడంతో మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును ఆదివారం కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలమని, కార్యకర్తలకు అండగా పార్టీ ఉంటుందన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో 97,500 పార్టీ సభ్యత్వాలు ఉన్నాయని, ఇప్పటివరకు 380మందికి మృతిచెందగా వారి కుటుంబాలకు రూ.7కోట్ల 60లక్షల ప్రమాద బీమాను అందజేశామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు విరాసత్‌అలీ, ఆకుల దేవేందర్, రాజు, బాబా షేర్‌అలీ, ఉమర్, అహ్మద్, పాల రమేశ్‌గౌడ్ తదితరులున్నారు.



గజ్వేల్ పట్టణానికి చెందిన చిక్కుడు కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులకు బీమా చెక్కును అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

### వివాహానికి ఆర్థిక సహాయం అందజేత

గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన అందోల్ అలేఖ్య వివాహానికి గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ ఆదివారం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారితో స్థానిక నాయకులు రాజిరెడ్డి, చాడా శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, అహ్మద్, నిజామోద్దీన్ తదితరులున్నారు.

### స్నేహితుడి కుటుంబానికి..

మిరుదొడ్డి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో స్నేహితులంతా ఏకమై స్నేహితుడి కుటుంబానికి ఆదివారం 20వేల రూపాయాల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మిరుదొడ్డి మండలం కాసులాబాద్‌కు చెందిన భూపతి 1990-91లో పదోతరగతి పూర్తి చేశాడు. ఇటీవల అతడు ఆకస్మికంగా మృతిచెందడంతో తోటి స్నేహితులు స్పందించి 20వేల రూపాయాలను ఆర్థిక సహాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. తమ స్నేహితుడి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ఈ సందర్భంగా వారు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ తాజామాజీ సర్పంచు బాల్‌రాజు, స్నేహితులు ర్యాకం మల్లేశం, చంద్రశేఖర్, రాందేవ్, అహ్మద్, ముత్యం, బాల్‌రాజు తదితరులున్నారు.



మిరుదొడ్డి: భూపతి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న స్నేహితులు

# గంజాయ్!

ఐదో పేజీ తరువాయి

విక్రయిస్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నలుగురూ 25 ఏళ్ల లోపు వారే. అందులో ఒకరు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న కుర్రాడు. మరొకరు ఓ హత్య కేసులో నిందితుడు. ఇంజనీరింగ్ చదువుకుంటున్న వారు కూడా గంజాయి విక్రయిస్తూ పట్టుబడుతుండడం చూస్తే ఆందోళనకరంగా ఉంది.

### బెట్టింగులతో అప్పుల పాలు

రాత్రికి రాత్రి కోటీశ్వరులు కావాలని.. కోట్లకు పడగలెత్తాలని అత్యాశతో యువత బెట్టింగులు, ఆన్‌లైన్‌గేమ్‌లను ఆడుతూ అప్పుల పాలవుతున్నారు. అప్పులు తీర్చే మార్గం లేక లోన్ యాప్‌ల్లో, దొరికిన చోటల్లా అప్పులు తీసుకొచ్చి.. పాత అప్పులు కడుతూ.. కొత్త అప్పులు చేసుకుంటున్నారు. చివరకు అప్పులు తీర్చే మార్గం లేక, కుటుంబసభ్యులకు చెప్పుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలా ఆత్మహత్యలు చేసుకుంటున్న యువత ఇటీవల కాలంలో పెరిగిపోయింది. 30 ఏళ్లలోపు యువతే ఎక్కువగా ఆత్మహత్యల వైపు మళ్లుతుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మానసిక వైద్యులు చొరవ తీసుకుని యువత పెడదారి పట్టకుండా చూడాల్సిన అవసరమున్నది.

## ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయుల సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బెజ్జంకి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో తాము చదువు చెప్పిన పూర్వ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగడం అభినందనీయమని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమండ్ల భాస్కర్ అన్నారు. మండలంలోని గుండారం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న రూపేష్, గౌరీ ప్రేమ్, సతీష్, హర్షవర్ధన్, శివప్రసాద్, అనిల్, రాజు, చందు, శ్రీకాంత్ అనే తొమ్మిదిమంది పూర్వ విద్యార్థులు వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో వారిని ఆదివారం సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమండ్ల భాస్కర్, ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చాన్నారు. ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు, గ్రామానికి పేరు తీసుకు వచ్చినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి సృజన, పొన్నం వనిత, పాము చంద్రశేఖర్, పూర్వ విద్యార్థులు వేణు, రమేష్, శ్రీకాంత్, సంతోష్, శశిధర్, రాజు, అనూష తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మీయ సమ్మేళనం

దుబ్బాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 1991-92లో ఏడో తరగతి చదివిన ఆదివారం ఆత్మీయ ఆత్మయ సమ్మేళనం జరుపుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

## అనాథ మహిళ.. ఆశ్రమానికి తరలింపు



అనాథ మహిళను ఆశ్రమానికి తరలిస్తున్న పోలీసులు, వైద్యసిబ్బంది

జహీరాబాద్ డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రివద్ద గత ఏడాదికాలంగా చెట్టుకింద ఉంటూ జీవనం గడుపుతున్న అనాథమహిళను ఆదివారం పోలీసులు, ఆస్పత్రి సిబ్బంది హైదరాబాద్‌లోని అమ్మానాన్న ఆశ్రమానికి తరలించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కాశీనాథ్ స్పందించి ఆమెను ఆశ్రమానికి సంబంధించిన వారితో పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుత వాతావరణం, తదితరాలను దృష్టిలో పెట్టుకుని అనాథమహిళను హైదరాబాద్‌లోని ఆశ్రమానికి తరలించినట్లు వారు వివరించారు. ఆమె మరాఠీభాషలో మాట్లాడుతుందని, తనది పండరిపూర్ ప్రాంతమని, తన వద్ద ఉన్న ఆస్తిని తీసుకుని కుటుంబీకులే వదిలేసినట్లు చెబుతున్నదని తెలిపారు. మరిన్ని వివరాలను చెప్పడానికి నిరాకరిస్తుందన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు

- అద్దె, ఇతర శాఖల్లోని ఇరుకు గదుల్లో కొనసాగింపు




అద్దె భవనంలో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్

నాగల్‌గిద్ద, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాగల్‌గిద్దను నూతన మండల కేంద్రంగా ఏర్పాటుచేసినప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించక పోవడంతో అద్దె భవనాల్లో కొన్ని, ఇతర కార్యాలయాల భవనాల్లో మరికొన్నింటిని కొనసాగిస్తున్నారు. దీంతో ఇరుకు గదుల్లో విధులు నిర్వహించడానికి ఉద్యోగులు, తగిన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రాష్ట్రంలోనే పెద్ద మండలంగా ఉన్న మనూరు మండలం నుంచి నాగల్‌గిద్దమండలాన్ని 2016లో నూతనంగా ఏర్పాటు చేశారు. ఎనిమిదేళ్లు గడుస్తున్నా పోలీస్ స్టేషన్, ఎంపీపీ కార్యాలయం, తహసీల్ కార్యాలయం, ఐకేపీ, వ్యవసాయ శాఖ, తదితర ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించక పోవడంతో కొన్నింటిని ఇతర శాఖల కార్యాలయాల్లో కొనసాగిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ మాత్రం అద్దె భవనంలోనే కొనసాగుతుంది. నాటి నుంచి ఈ కార్యాలయాల్లో ఇరుకు గదుల్లో విధులు నిర్వహించడానికి ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలపరిషత్ సమావేశాలు సైతం ఇరుకుగదుల్లోనే నిర్వహించేవారు. కార్యాలయానికి వచ్చే జనాలకు కనీసం కూర్చునేందుకు సరియైన వసతులు లేవు. అంతేకాకుండా తాగునీటి సమస్య, వాష్‌రూంల సమస్య కూడా ఉన్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న మారుమూల ప్రాంతమైన నాగల్‌గిద్ద మండలంలో అన్నిప్రభుత్వ కార్యాలయాలకు సొంతభవనాలను ఏర్పాటు చేయాలని ఆయా శాఖల ఉద్యోగులు, స్థానికులు కోరుతున్నారు.